క్లుప్తంగా

పోక్సో కేసులో రౌడీషీటర్ అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(క్రైమ్): ప్రేమ పేరిట బాలికను మోసగించిన ఘటనలో రౌడీషీటర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను వేదాయపాళెం పోలీస్‌స్టేషన్లో నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి గురువారం వెల్లడించారు. బీవీనగర్‌కు చెందిన ఓ బాలిక నగరంలో ఇంటర్మీడియట్ చదువుతోంది. గత నెల 20న ఇంటి నుంచి అదృశ్యమయ్యారు. తల్లి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసును నమోదు చేసిన వేదాయపాళెం పోలీసులు బాలిక కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ప్రేమిస్తున్నానని.. పెళ్లి చేసుకుంటానని బాలికను నమ్మించి పడారుపల్లికి చెందిన రౌడీషీటర్ వెంకటేష్ తన వెంట తీసుకెళ్లారని విచారణలో వెల్లడైంది. దీంతో మిస్సింగ్ కేసును పోక్సో కేసుగా మార్చు చేశారు. విచారణ చేపట్టిన నగర డీఎస్పీ ఈ మేరకు నిందితుడ్ని అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ నరసింహారావు, ఎస్సై రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులో..

నెల్లూరు(క్రైమ్): ప్రేమ పేరిట యువతిని వంచించడంతో పాటు ఆమెను కులం పేరుతో దూషించిన ఘటనలో నిందితుడ్ని పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. పడారుపల్లిలోని చలపతినగర్‌కు చెందిన యువతి గూడూరులోని ఓ ప్రైవేట్ నర్సింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ట్యూటర్‌గా పనిచేస్తున్నారు. నగరంలోని ఓ ప్రముఖ న్యూరో కేర్ హాస్పిటల్లో గతంలో ఆమె పనిచేశారు. ఆ సమయంలో అక్కడే అటెండర్‌గా పనిచేస్తున్న వాకాడు మండలం తూపిలిపాళేనికి చెందిన కార్తీక్ ప్రేమిస్తున్నానని.. పెళ్లి చేసుకుంటానని ఆమెను నమ్మించారు. అనంతరం పెళ్లి చేసుకోమని ఆమె కోరగా మాటదాటేశారు. నిలదీయడంతో కులం పేరుతో దూషించారు. ఈ క్రమంలో కార్తీక్ మరో యువతితో నిశ్చితార్థం చేసుకుంటున్నారనే విషయాన్ని తెలుసుకున్న బాధితురాలు అక్కడికి వెళ్లి ఆపేందుకు యత్నించారు. దీంతో ఆమెను నానా దుర్భాషలాడి.. ఇంటికొచ్చి మరోసారి కులంపేరుతో దూషించారు. దీంతో బాధితురాలు వేదాయపాళెం పోలీసులకు గతేడాది డిసెంబర్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిపై వివిధ సెక్షన్లతో పాటు ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద కేసును నమోదు చేశారు. నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి విచారణ చేపట్టి నిందితుడ్ని అరెస్ట్ చేశారు.

స్థలంలోకి అక్రమంగా ప్రవేశం

నెల్లూరు(క్రైమ్): వైద్యుడి స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి అక్కడి వస్తువులను ధ్వంసం చేయడంతో పాటు పనివారిని చంపుతానని బెదిరించిన వ్యక్తిపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరానికి చెందిన రవి ప్రభుత్వ వైద్యుడిగా పనిచేస్తున్నారు. కెనరా బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ నిర్వహించిన వేలంలో వనంతోపు మూడో వీధిలోని ఖాళీ స్థలాన్ని ఆయన దక్కించుకున్నారు. సదరు స్థలంలో శంకుస్థాపన చేయాలని ఆయన నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో స్థలంలో పనివారు తగిన ఏర్పాట్లు చేస్తుండగా నాగార్జునరెడ్డి అక్రమంగా ప్రవేశించి సామగ్రిని ధ్వంసం చేశారు. పనివారిని నానా దుర్భాషలాడి చంపుతామంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్డును మార్చి.. నగదును కాజేసి

నెల్లూరు(క్రైమ్): ఏటీఎం కార్డును ఓ గుర్తుతెలియని వ్యక్తి మార్చేసి నగదును దోచేసిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. కరెంటాఫీస్ సెంటర్ సమీపంలోని రిత్విక్ ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్న సుమన్ తల్లి విజయలక్ష్మికి బ్యాంక్ ఆఫ్ బరోడాలో ఖాతా ఉంది. తన బ్యాంక్ ఖాతా నుంచి నగదును డ్రా చేసి తీసుకురావాలని కుమారుడికి ఏటీఎం కార్డును బుధవారం ఇచ్చారు. దీంతో కరెంటాఫీస్ సెంటర్‌లోని ఎస్బీఐ ఏటీఎం సెంటర్‌కు వెళ్లారు. అక్కడ నగదును డ్రా చేసే క్రమంలో గుర్తుతెలియని వ్యక్తి త్వరగా పనికానీయాలని ఒత్తిడి తేవడంతో పాటు బయట ఉన్న వ్యక్తికి సైగలు చేయసాగారు. విషయాన్ని గమనించిన సుమన్ వెనక్కి తిరిగి చూస్తుండగా, మిషన్‌లోని కార్డును దుండగుడు మాయం చేశారు. మిషన్ వైపు తిరిగి చూసేసరికి కార్డు కనిపించలేదు. గాలిస్తుండగా ఇదిగో కార్డు అంటూ దుండగుడు మరో కార్డును ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయారు. కార్డు మారిందనే విషయాన్ని గమనించని సుమన్ నగదును డ్రా చేసేందుకు యత్నించగా, అది పనిచేయలేదు. ఏటీఎం కార్డును పరిశీలించగా, అది ఐసీఐసీఐ బ్యాంకుదిగా తేలింది. దీంతో మోసపోయానని గ్రహించి ఇంటికెళ్లారు. ఇంతలోనే దుండగుడు వివిధ ఏటీఎంల నుంచి రూ.25 వేలను డ్రా చేయడంతో పాటు నగరంలోని అమరా ఫిల్లింగ్ స్టేషన్ వద్ద రూ.50 వేలను స్వైప్ చేశారని విజయలక్ష్మి ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో సదరు ఫిల్లింగ్ స్టేషన్ వద్దకు వెళ్లి విచారించగా, స్వైప్ చేసిన వ్యక్తి శ్రీనివాసులు అని తేలింది. బాధితుడి ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆడపిల్లలను చదివించాలి



మాట్లాడుతున్న సురేష్

నెల్లూరు(వేదాయపాళెం): ఆడపిల్లలపై వివక్షను విడనాడి వారిని చదివించుకుందామని జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్ పేర్కొన్నారు. బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమాన్ని నగరంలోని ట్రిబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో ఐసీపీఎస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 18 ఏళ్లలోపు బాలికలకు వివాహాలు చేస్తే వ్యతిరేకించాలని కోరారు. 1098, 100కు ఫోన్ చేయాలని, అధికారులు వచ్చి బాల్య వివాహాలను అడ్డుకుంటారని తెలిపారు. అనంతరం గుడ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ విజయలక్ష్మి, ఐసీపీఎస్ సిబ్బంది సమత, తదితరులు పాల్గొన్నారు.

డీఈఓను కలిసిన వైఎస్సార్‌టీఎఫ్ నేతలు



నెల్లూరు (టౌన్): నగరంలోని జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో డీఈఓ గంగాభవానీని వైఎస్సార్ టీఎఫ్ నేతలు మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలను తెలియజేశారు. వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాసు, ప్రధాన కార్యదర్శి రఘురామ్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శి నారాయణరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుదర్శన్, రాష్ట్ర కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సురేంద్ర, డీఎస్సీ – 98 అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అండగా ఉంటా



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు (టౌన్): తనను గెలిపిస్తే ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు ఎనలేని సేవలను అందిస్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మాగుంట లేఅవుట్లోని ఓవెల్ స్కూల్లో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై తనకు అవగాహన ఉందని, వీటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల అధినేత వేణు, తదితరులు పాల్గొన్నారు.

'పేర్నాటికి సంపూర్ణ మద్దతు'



నెల్లూరు (వేదాయపాళెం): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి ఆలిండియా ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ సంపూర్ణ మద్దతునిస్తోందని సంఘ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ దాసు పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలో పలువురు పట్టభద్రులను సంఘ నేతలు గురువారం కలిసి పేర్నాటికి ఓటేయాలని కోరారు. సంఘ నగరాధ్యక్షుడు పురుషోత్తం, రూరల్ సలహాదారు శ్రావణ్‌కుమార్, రత్నం, కార్పొరేటర్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి ప్రజాసత్తా, దాని 11 అనుబంధ సంఘాలు మద్దతిస్తున్నాయని వ్యవస్థాపక అధ్యక్షుడు శోభన్‌బాబు పేర్కొన్నారు. ఈ మేరకు శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

చెల్లని చెక్కు కేసులో ఒకరికి ఏడాది జైలు

నెల్లూరు(లీగల్): ఆక్వా కంపెనీ వద్ద నుంచి రొయ్యల మేతను అప్పుగా తీసుకొని తిరిగి చెల్లించే క్రమంలో రెండు చెల్లని చెక్కులను ఇచ్చారనే కేసులో నేరం రుజువు కావడంతో తూర్పుగోదావరి జిల్లా మెట్టకూరుకు చెందిన శివకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.20 లక్షలను ఫిర్యాదికి ఆర్నెల్లోపు పరిహారంగా చెల్లించాలని ఐదో అదనపు మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి దేవిక గురువారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు.. కోవూరులోని శాంతినగర్‌కు చెందిన శ్రీనివాసరెడ్డి మ్యాక్స్‌వెల్ ఫార్ములేషన్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఆక్వా ఫీడ్స్ కంపెనీని నిర్వహిస్తున్నారు. సదరు కంపెనీ నుంచి రూ.12,08,237 విలువజేసే రొయ్యల మేతను 2018, జనవరిలో శివ అప్పుగా తీసుకున్నారు. అప్పును తిరిగి చెల్లించే క్రమంలో అదే నెల్లో రూ.రెండు లక్షలకు ఒక చెక్కు, ఫిబ్రవరి ఏడున రూ.పది లక్షలకు మరో చెక్కును యాక్సిస్ బ్యాంక్, తూర్పుగోదావరి జిల్లా పేరిట శ్రీనివాసరెడ్డికి ఇచ్చారు. చెక్కులను హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, నెల్లూరు శాఖలోని తన ఖాతాలో జమ చేయగా, నగదు లేని కారణంగా బౌన్సయ్యాయి. అదే ఏడాది మార్చి మూడున న్యాయవాది ద్వారా లీగల్ నోటీస్‌ను పంపి అనంతరం కోర్టులో కేసును దాఖలు చేశారు. విచారణలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో పైమేరకు తీర్పు చెప్పారు.

అనుమానంతోనే కడతేర్చాడు

- అనుదీప్ హత్య కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): నెల్లూరులో కలకలం రేకెత్తించిన అనుదీప్ హత్య కేసులో నిందితుడ్ని వేదాయపాళెం పోలీసులు అరెస్ట్ చేశారు. వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో కడతేర్చానని నిందితుడు అంగీకరించాడు. నగరంలోని వేదాయపాళెం పోలీస్‌స్టేషన్లో నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఇన్‌స్పెక్టర్ నరసింహారావుతో కలిసి గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. పొదలకూరు లోని రామమందిరం వీధికి చెందిన అనుదీప్ (30), పావని దంపతులకు పాప ఉంది. ఏడు నెలల క్రితం తన కుటుంబంతో కలిసి నెల్లూరొచ్చి బుజబుజనెల్లూరులోని గణపతిప్లాజాలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో గత నెల 22వ తేదీ తెల్లవారుజామున అనుదీప్ తన స్నేహితుడైన పొదలకూరుకు చెందిన సురేష్ చేతిలో హత్యకు గురైన విషయం తెలిసిందే. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టగా సురేష్ సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉండటంతో అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మనుబోలు మండలం వడ్లపూడిలో సురేష్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అతని వద్ద బైక్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఇద్దరూ స్నేహితులే..

పొదలకూరులో అనుదీప్, సురేష్‌లు పక్క పక్క ఇళ్లలో నివాసం ఉండేవారు. ఇరు కుటుంబాలు ఎంతో కలివిడిగా ఉండేవి. ఈ క్రమంలో అనుదీప్‌కు తన భార్యతో వివాహేతర సంబంధం ఉందొచ్చనే అనుమానం సురేష్‌లో బలంగా నాటుకుపోయింది. దీంతో స్నేహితుల మధ్య మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. ఎలాగైనా అనుదీప్‌ను హత్యచేయాలని నిందితుడు నిర్ణయించుకున్నారు. గత నెల 22వ తేదీ తెల్లవారుజామున 3.30కు నెల్లూరుకు చేరుకొని అనుదీప్‌ను కలిశారు. తల్పగిరి కాలనీ సమీపంలో మూత్రవిసర్జనకు అనుదీప్ బైక్‌ను ఆపగా, ఇదే అదునుగా భావించిన సురేష్ కత్తితో అతని గొంతు కోసి హత్య చేశారు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడని డీఎస్పీ వెల్లడించారు. కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్, ఎస్సై రాజ్‌కుమార్, హెడ్ కానిస్టేబుళ్లు సుబ్బారావు, సురేష్, కానిస్టేబుళ్లు మస్తాన్, నాగరాజును డీఎస్పీ అభినందించారు. రివార్డ్ కోసం ఎస్పీకి సిఫార్సు చేశారు.

మంటలు వ్యాపించి వృద్ధుడికి గాయాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): స్టౌపై వంట చేస్తున్న సమయంలో గ్యాస్ లీకై మంటలు వ్యాపించి వృద్ధుడు గాయపడిన ఘటన 53వ డివిజన్లోని గాంధీగిరిజన కాలనీలో చోటుచేసుకుంది. ఘటనలో బలరామయ్య ముఖం, ఛాతిభాగాలకు గాయాలయ్యాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు వెంకటరమణ, రవి, పురుషోత్తం, శ్రీనివాసులు, తదితరులు బాధితుడ్ని ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందేలా చర్యలు చేపట్టారు.

ఖగోళ శాస్త్రంపై అవగాహన



నెల్లూరు (టౌన్): ఖగోళ శాస్త్రంపై విద్యార్థులకు టెలిస్కోప్ ద్వారా అవగాహన కార్యక్రమాన్ని బీవీనగర్‌లోని కేఎన్నార్ స్కూల్లో గురువారం నిర్వహించారు. వివిధ అంశాలను జిల్లా సైన్స్ సెంటర్ క్యురేటర్ సుబ్రహ్మణ్యం వివరించారు. ప్రధానోపాధ్యాయుడు విజయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

'వికాస్ ఆరోగ్య దీపిక'కు విరాళం



నెల్లూరు(బృందావనం): వికాస్ ఆరోగ్య దీపిక పథకానికి రూ.పది వేలను సుధాకర్ విరాళంగా గురువారం అందజేశారని వికాస్ ప్రజాహిత సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, 14వ డివిజన్ కార్పొరేటర్ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. దాతలకు ఆయన కృతజ్ఞతలను తెలియజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రైతుబజార్ సబ్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీపురం ఫీడర్‌లో విద్యుత్ కండక్టర్లను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శుక్రవారం ఉండదని స్టోన్‌హౌస్‌పేట ఏఈ సుకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీపురం, పుష్పలవీధి, అరుణాచలంవీధి, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

- నగరంలోని తెలుగుగంగ సబ్‌స్టేషన్లో మరమ్మతుల కారణంగా శివాజీనగర్, ఎన్‌సీసీ కాలనీ, ఎన్బీటీ కాలనీ, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని ఐఈ సెక్షన్ ఏఈ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.

జయలక్ష్మికి నివాళి



నెల్లూరు (అర్బన్): ఏపీ వైద్య ఆరోగ్య శాఖ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ శ్రీనివాసులు సతీమణి జయలక్ష్మి ఇటీవల మరణించడంతో కుటుంబసభ్యులను హెల్త్ అండ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంస) జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైద్య, ఆరోగ్య శాఖ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరిబాబు, గౌరవాధ్యక్షుడు విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

నెల్లూరు(అర్బన్): ఉద్యోగుల సమస్యలపై పోరాటానికి సిద్ధంగా ఉండాలని ఏపీ ఆర్ఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ పెంచలరెడ్డి పేర్కొన్నారు. ఆందోళనల్లో భాగస్వాములను చేసేందుకు గానూ ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో ఆరుగురు రాష్ట్ర నేతలు నగరానికి గురువారం వచ్చారు. కలెక్టరేట్లో జేసీ కూర్మనాథ్, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డిని కలిసి ప్రణాళికను వివరించారు.

రంగడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



పూజలు చేస్తున్న వేదపండితులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వేడుకగా గురువారం ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధానార్చకులు జగన్నాథాచార్యులు, సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా వివిధ పూజా కార్యక్రమాలు, గరుడ ధ్వజ ప్రతిష్ఠ, అంకురార్పణ, హోమం, తదితరాలను విశేషంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా గా యని వత్సలతో భక్తి సంగీతం, భాగ్యలక్ష్మి ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో భక్తిగీతాలాపనలు వీనులవిందుగా సాగాయి. ఉభయకర్తగా ఆనం గోపాలకృష్ణారెడ్డి వ్యవహరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం ఐదు గంటలకు ధ్వజారోహణ, రాత్రి తొమ్మిది గంటలకు శేషవాహనసేవను నిర్వహించనున్నారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి పర్యవేక్షించారు.

కుక్కల పట్టివేత



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53, 54వ డివిజన్ల పరిధిలో గల వెంకటేశ్వరపురం, పోస్టాఫీస్ వీధి, నల్లకాలువ, తదితర ప్రాంతాల్లో కుక్కలను కార్పొరేషన్ సిబ్బంది పట్టుకొని ప్రత్యేక వాహనాల్లో తరలించారు. 'కుక్కల స్వైరవిహారం' అనే శీర్షికన సాక్షిలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ క్రమంలో కుక్కల పట్టివేతను చేపట్టారు.

– సాక్షి ఎఫెక్ట్

సాక్షి ఎఫెక్ట్..

వీరి చలపతికి శుభాకాంక్షలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావుకు జన్మదిన శుభాకాంక్షలను పలువురు గురువారం తెలియజేశారు. డీసీఎమ్మెస్ డైరెక్టర్ ఖిల్జీ సలీమ్, బీఎం వెంకటస్వామి, తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛాలను అందజేశారు.

హెచ్చరిక నోటీసు

ఇందుమూలముగా తెలియచేయుట ఏమనగా నా కక్షిదారుడైయిన **పాబోలు వెంకట సతీష్‌బాబు తండ్రి వెంకట సుబ్బయ్య** అనువారు ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని దాని హక్కుదారుడయిన **మన్నారు వెంకట రమేష్ చంద్ర తండ్రి. లక్ష్మయ్య నాయుడు** వద్ద (ఈ ఆస్థి **లక్ష్మయ్య నాయుడు** గారికి ఆయన అన్నలు, చెల్లెలు అనగా **మన్నారు వెంకట** రాగిని మరియు ఇతరులు వ్రాయించి ఇచ్చిన **దాఖ్యుమెంటు నెం.8807/1995** తేది.**27-9-1995**గా గల రిలీజు పత్రము ద్వారా సంక్రమించినది) కొనుగోలు చేయదలచినందున, ఎవ్వరికైన ఎటువంటి అభ్యంతరములు ఉన్న క్రింది అడ్రసుకు వారము రోజులలోపల వ్రాతములముగా పంపవలసినది.

ఆస్థి షెడ్యూలు : నెల్లూరు టౌను, మూలపేట, గొల్లవీధి, CAS No.407, 48 అంకణముల స్థలము అందులోని గ్రౌండు మొదటి అంతస్థు గల MTC RCC మరియు ACC కట్టుబడులతో ఇల్లు పాత డోర్ నెం.24-236, క్రొత్తడోర్ నెం.24-1-165కు **హద్దులు: తూర్పు :** నెల్లూరు మధుసూధనరావు గారి ఇల్లు కొంతమేర, రామయ్య గారి ఇల్లు కొంతమేర, **దక్షిణం :** యాదవవీధి, **పడమర :** మహాలక్ష్మమ్మ ఇల్లు కొంతమేర, కాళహస్తి రుక్మిణమ్మ కొంతమేర, **ఉత్తరం :** మునిసిపల్ రోడ్డు.

యమ్.వి. విజయకుమారి, M.Com, BL
న్యాయవాది
2వ వీధి, జడ్.పి.కాలనీ, నెల్లూరు టౌను
సెల్ : 9700067978